# అభివృద్ధి వెంటే ఖమ్మం ప్రజలు

- ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపును మరెవ్వరూ ఆపలేరు..
- నేను ఇక్కడి వాడిని కాబట్టే ఖమ్మం నియోజకవర్గాన్ని నంబర్‌వన్‌గా నిలిపా..
- గతంలో మంత్రిగా చేసిన తుమ్మల అప్పుడే ఎందుకు అభివృద్ధి చేయలేదు?
- ఆత్మీయ సమ్మేళనాలు, డివిజన్ల ప్రచారాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్



ఇంటింటి ప్రచారంలో భాగంగా చంటి పాపను ముద్దు చేస్తున్న అజయ్

ఖమ్మం, నవంబర్ 23: ఖమ్మం ప్రజలందరూ అభివృద్ధి వెంటే ఉన్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపును మరెవ్వరూ ఆపలేరని తేల్చిచెప్పారు. తాను ఇక్కడి వాడిని కాబట్టే, ఇక్కడి ప్రజల కష్టాలు తెలిసిన వాడిని కాబట్టే ఖమ్మాన్ని అద్భుతంగా తీర్చిదిద్దానని, ప్రజల కష్టాలకు పరిష్కారం చూపానని గుర్తుచేశారు. ఖమ్మం నగరంలో గురువారం పర్యటించిన ఆయన.. పలు డివిజన్లలో ఆత్మీయ సమ్మేళనాలు, ఇంటింటి ప్రచారాలు, రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించానని, అభివృద్ధిలో మొదటిస్థానంలో నిలిపానని అన్నారు. ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు తెచ్చి నిర్విరామంగా పనిచేయడం వల్లనే ఇంతటి ప్రగతి సాధ్యమైందని అన్నారు. మంత్రిగా ఉండి కూడా అధికారులను వెంటబెట్టుకొని నగరంలోని ప్రతి వీధినీ పరిశీలించానని అన్నారు. అభివృద్ధి కోసం అక్కడికక్కడే అంచనాలు వేయించి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేశానని వివరించారు. ఇంతకుమునుపు మంత్రులెవరూ ఇలా సైకిళ్లపై తిరిగి పనులు చేయలేదని గుర్తుచేశారు. ఇదే కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు గతంలో టీడీపీ ప్రభుత్వంలోనూ, ఆ తరువాత ఇక్కడి ఎమ్మెల్యేగానూ పనిచేసినప్పటికీ అప్పుడు ఖమ్మాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో తాను ఖమ్మాన్ని తీర్చిదిద్దితే ఇప్పుడు తుమ్మల ఖమ్మం వచ్చి ఇదంతా అతనే కృషేనని చెప్పుకుంటుండడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశాను కాబట్టే ఇక్కడికి అనేక కార్పొరేట్ కంపెనీలు వచ్చి షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేస్తున్నాయని వివరించారు. తద్వారా ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తున్నాయని అన్నారు. ఈ ఎన్నికల్లో మొదటి బ్యాలెట్‌లో మొదటి సంఖ్యలో ఉన్న కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కొండబాల కోటేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, కొత్తపల్లి నీరజ, వల్లభనేని రామారావు, దొడ్డ కోటేశ్వరరావు, అడపా వెంకటేశ్వరరావు, మోత్కూరు ప్రసాద్, వెంకటాద్రినాయుడు, జట్ల ప్రసాద్, దొడ్డ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

**అజయ్‌కి హారతులిచ్చిన మహిళలు..**

కాగా, ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్ 13వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తుండడంతో అక్కడి మహిళలు ఆయనకు తిలకం దిద్ది మంగళ హారతులు పట్టారు.

## కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం

బీఆర్ఎస్ నూతన మ్యానిఫెస్టో రాష్ట్ర ప్రజలకు వరంలాంటిది..
మరోసారి అధికారంలోకి వస్తే నియోజకవర్గమంతా దళితబంధు
మణుగూరు పట్టణ ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాంతారావు



ప్రచారంలో చంటి పాపతో బీఆర్ఎస్ అభ్యర్థి రేగా

మణుగూరు టౌన్, నవంబర్ 23: ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గ అభ్యర్థి రేగా కాంతారావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఇటీవల ప్రకటించిన నూతన మ్యానిఫెస్టో రాష్ట్ర ప్రజలక వరం లాంటిదని అన్నారు. కేసీఆర్ మరోసారి అధికారంలోకి వస్తే నియోజకవర్గంతా దళితబంధు పథకాన్ని అమలు చేస్తారని అన్నారు. మణుగూరు పట్టణంలో గురువారం పర్యటించిన ఆయన.. రాజుపేట, కోటకట్ట, విఠల్‌రావు నగర్, పీకే–1 సెంటర్, కుమ్మరిబజార్, కొత్తకొండాపురం, బాపనకుంట, గాంధీబొమ్మ సెంటర్, శివలింగాపురం, శేషగిరినగర్, గోల్డ్‌షాప్‌లైన్, రామాలయం వీధి, భగత్‌సింగ్ నగర్, చేపలమార్కెట్ ఏరియా, కాళీమాతటెంపుల్ ఏరియా, అశోక్‌నగర్, సాయిబాబా టెంపుల్ ఏరియా, కూనవరం, సమితిసింగారం ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రకారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన మ్యానిఫెస్టోలో చెప్పినట్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాగానే మరిన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయని అన్నారు. సౌభాగ్య లక్ష్మి పథకం కింద మహిళలకు రూ.3 వేల గౌరవ భృతి, రైతుబంధు కింద రూ.16 వేల పంటల పెట్టుబడి సాయం, ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల బీమా వంటివి అమలుకానున్నట్లు చెప్పారు. కేవలం పదేళ్లలోనే తెలంగాణను తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కాగా, మణుగూరు పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి తొలి రోజు చేపట్టిన ప్రచారానికి అపూర్వ స్పందన లభించింది. తొలుత ఆయన పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పలు కాలనీల్లో మహిళలు తిలకం దిద్ది మంగళహారతులు పట్టి, పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు.

## ఇల్లెందు గడ్డపై గులాబీ జెండా ఎగరేద్దాం

- బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ సమగ్రాభివృద్ధి సాధ్యం
- ఇప్పటికే రూ.1,800 కోట్లతో అనేక అభివృద్ధి పనులు
- గార్ల మండల పర్యటనలో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ



ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్‌కు పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

గార్ల, నవంబర్ 23: ఇల్లెందు గడ్డపై గులాబీ జెండా ఎగరేద్దామని స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి హరిప్రియానాయక్ పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ గులాబీ జెండాను ఆదరించాలని, ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. గార్ల మండలంలో గురువారం పర్యటించిన ఆమె.. వివిధ గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. తొలుత గార్ల మండలం కేంద్రంలో 2000 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇల్లెందులో బీఆర్ఎస్‌ను చరిత్రను తిరగరాయాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ సహకారంతో రూ.1,800 కోట్లతో నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేశామని అన్నారు. రాంపురం వద్ద పాకాల ఏటిపై రూ.15 కోట్లతో త్వరలోనే హై లెవల్ బ్రిడ్జి నిర్మిస్తామని అన్నారు. ఇప్పటికే ప్రతి వీధిలోనూ సీసీ రోడ్లు నిర్మించామని అన్నారు. గార్లలో 100 బెడ్ల ఆసుపత్రి నిర్మించామని, జిల్లా కేంద్రంలోని వైద్యులు ఇక్కడికి వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. ఇక ముందు కూడా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. నూతన మ్యానిఫెస్టో ప్రకారం బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాగానే ఇంకొన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అన్నారు. ముఖ్యంగా రైతుబంధు సాయాన్ని దశల వారీగా రూ.16 వేలకు పెంచనున్నట్లు చెప్పారు. అందుకని బీఆర్ఎస్‌కు అండగా నిలిచి కారు గుర్తుకు ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు అంగోత్ బిందు, శీలంశెట్టి రమేశ్, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ప్రవీణ్‌నాయక్, పానుగంటి రాధాకృష్ణ, గాజుల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి..

- సీఎం సహకారంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా
- మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధిని చేసి చూపిస్తా
- ములకలపల్లి ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా



బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెచ్చా

ములకలపల్లి, నవంబర్ 23: రాష్ట్ర ప్రభుత్వ పథకాలే రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను, నియోజకవర్గంలో తనను గెలిపిస్తాయని అశ్వారావుపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలకూ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని గుర్తుచేశారు. ములకలపల్లి మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. సీతాయిగూడెం, సూరంపాలెం, నల్లముడి, గండిప్రోలు, కొమ్ముగూడెం, కమలాపురం, మామిళ్లగూడెం, గుట్టగూడెం, చాపరాలపల్లి, రామచంద్రాపురం, మాధారం, పూసుగూడెం, సీతారాంపురం, ములకలపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ సున్నం నాగమణి, వగ్గెల పూజ, భూక్యా ప్రసాద్‌లతో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు, కార్యకర్తలు ఎమ్మెల్యే మెచ్చాకు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో మహిళలు ఉత్సాహంగా 'గులాబీ జెండలమ్మ..' పాటకు స్టెప్పులేయడంతో ఎమ్మెల్యే మెచ్చా కూడా వారిని ఉత్సాహ పరుస్తూ తాను కూడా స్టెప్పులేస్తూ ముందుకు సాగారు. ప్రజాప్రతినిధులు పైడి వెంకటేశ్వరరావు, మట్ల నాగమణి, భూక్యా ప్రసాద్, బైటి రాజేశ్, వాడే నాగరాజు, గొల్ల పెంటయ్య, గడ్డం భవానీ, కుంజా నాగమణి, సున్నం సుశీల, మోరంపూడి అప్పారావు, పామర్తి వెంకటేశ్వరరావు, నందూమరి సురేశ్, పాలకుర్తి ప్రసాద్, పుష్పాల చందర్‌రావు, తుర్రం శ్రీను, కోమళ్ల దుర్గాప్రసాద్, కొండవీటి రాజారావు, తాండ్ర బుచ్చిబాబు, తాండ్ర రాంబాబు, బిక్కుమళ్ల సుధాకర్, కోండ్రు సుందర్‌రావు, తాటి ప్రవీణ్, పామర్తి గోపి, సూరం పుల్లారావు, గూడపాటి సురేష్, సోయం చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లోకి చేరికలు...**

అన్నపురెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పర్సా మాధవ్, పర్సా నాగప్రసాద్‌లు మండలంలోని రామచంద్రాపురంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరితోపాటు సీతాయిగూడెం మాజీ సర్పంచ్ బీఆర్ఎస్‌లో చేరారు. భారత లావణ్యారాం, సున్నం నాగమణి, వగ్గెల పూజ, భూక్యా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పథకాలే శ్రీరామరక్ష

ఎన్నికల్లో గెలిపిస్తే ఏజెన్సీని అభివృద్ధి చేసి చూపిస్తా..
ఈ మండల వాసినైన నన్ను ఆదరించి ఆశీర్వదించండి
దుమ్ముగూడెం ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం



మహాదేవపురంలో పర్యటిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు

మ్ముగూడెం, నవంబర్ 23: తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ పథకాలే శ్రీరామరక్షగా నిలుస్తాయని బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఏజెన్సీ ప్రాంతాన్ని పూర్తిగా అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. దుమ్ముగూడెం మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. అచ్యుతాపురం, మహాదేవపురం, వర్క్‌షాప్ గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల నిర్వహించారు. ఈ సందర్భంగా మహాదేవపురంలో తెల్లం సమక్షంలో కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి 50 కుటుంబాల వారు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. స్థానికుడిని, మండలవాసిని అయిన తనను ఈ ఎన్నికల్లో ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. 50 ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధికీ నోచుకోని ఈ ప్రాంతాన్ని తెలంగాణ ప్రభుత్వమే తీర్చిదిద్దిందని అన్నారు. ఇప్పుడు తనను గెలిపిస్తే సీఎం కేసీఆర్ సహకారంతో మరింతగా అభివృద్ధి చేస్తానని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు నూతన మ్యానిఫెస్టోలో ప్రకటించిన మరిన్ని పథకాలను కూడా అందిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికే చేసిన అభివృద్ధిని, ఇకముందు చేయబోయే పనులను గమనించి నియోజకవర్గ ప్రజలు తనను అండగా నిలవాలని కోరారు. ఇందుకోసం కారు గుర్తుపై ఓటు వేసి తనకు అధిక మెజార్టీ అందించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నె సత్యనారాయణమూర్తి, రేసు లక్ష్మి, తెల్లం సీతమ్మ, కణితి రాముడు, ఎండీ జానీపాషా, మట్టా వెంకటేశ్వరరావు, జ్యోతి, దామెర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.